నో బ్యాగ్ డేతో సత్ఫలితాలు

- ప్రభుత్వ ఆదేశాలతో బ్యాగ్ లేకుండా బడికి
- ప్రతి నెలా మొదటి, మూడో శనివారం అమలు
- ఆటలు, పాటలతో ఉత్సాహం నింపేందుకు..



పలగర గుడివాడ కాలనీ పాఠశాలలో మాస్కులతో చిన్నారుల ప్రదర్శనలు

మండలంలో పాఠశాలల వివరాలు		
పాఠశాల రకం	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	43	1,371
ప్రాథమికోన్నత	4	449
ఉన్నత	9	2,318

బలిజిపేట: ఎస్సీఆర్టీ (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్) ఆదేశాలతో సర్కార్ బడులలో నెలలో మొదటి, మూడవ శనివారాలు నో బ్యాగ్డే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. 2019వ సంవత్సరం నుంచి దీనిని అమలు చేసేందుకు అప్పట్లో ఆదేశాలు ఇచ్చారు. అయినా పక్కాగా అమలు కాలేదు. ఇప్పుడు పిల్లలు చదువు వల్ల ఒత్తిడికి గురి కాకుండా ఉండేందుకు నో బ్యాగ్డేను అమలు చేస్తున్నారు. విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని రేకెత్తించేలా వారిలో సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు తగిన వాతావరణాన్ని కల్పించేలా ఈ నో బ్యాగ్డేను అమలు చేస్తున్నారు. బ్యాగుల భారాన్ని ఒక్క రోజైనా తగ్గించేందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.



సంబరాలతో చిన్నారులు

1, 2తరగతులకు ఇలా..

సృజన సందడిలో భాగంగా 1, 2తరగతుల పిల్లలకు 'పాడుకుందాం' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో పాఠాలు, గేయాలు, జానపదాలు, నీతి పద్యాలను పాడించడం, మాట్లాడుకుందాంలో భాగంగా కథలు, పజిల్స్, సరదా ఆటలను ఆడించడం, నటిద్దాంలో భాగంగా నాటికలు, ఏకపాత్రాభినయం, నృత్యం, అభినయం, డైలాగులు పలికించడం వంటివి చేస్తారు. సృజనలో భాగంగా డ్రాయింగ్, మట్టి బొమ్మల తయారీ, మాస్కులు, అలంకార వస్తువులను చేయడం నేర్పిస్తారు.

సృజనాత్మకతకు పదును

నో బ్యాగ్డే అమలు సత్ఫలితాలిస్తోంది. పుస్తకాలకే పరిమితమైన విద్యార్థులకు నో బ్యాగ్డే ఉపశమనం కలిగిస్తుంది. విద్యార్థులతో పాటలు పాడించడం, ఆటలు ఆడించడం, మొక్కల పెంపకం వంటి వాటిపై అవగాహనలు కల్పించడం మంచి సత్ఫలితాలను అందిస్తాయి.

– శ్రీనివాసరావు, ఎంఈఓ, బలిజిపేట

3, 4, 5తరగతులకు ఇలా..

3, 4, 5తరగతుల పిల్లలకు తోటకు పోదాంలో భాగంగా బడి ఆవరణలో మొక్కలు నాటడం, కలుపుతీత, పందిర్లు వేయడం లాంటివి చేపట్టడం, బడిలో పరిసరాలను శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలి. విందాం, విందాం కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామంలోని హెల్త్ వర్కర్, పంచాయతీ సెక్రటరీ, రైతు, వ్యాపారులను బడికి పిలిపించి వారితో మాట్లాడించడం వంటివి చేయించాలి.

యశ్పాల్ కమిటీ సూచనల మేరకు..

పుస్తకాల భారం విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో యశ్పాల్ కమిటీ అధ్యయనం చేసింది. గుణాత్మక విద్య అందించాలని సూచించింది. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 3కిలోలకు మించి పుస్తకాల బరువు ఉండకూడదని, పదో తరగతి విద్యార్థులకు 5కిలోల వరకే బరువు ఉండాలని సూచించింది. దీనిని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిగణనలోకి తీసుకుని నో బ్యాగ్డే అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

మళ్లీ జగన్నే సీఎం చేద్దాం..



పింఛన్ లబ్ధిదారులకు సొమ్ము అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

- టీడీపీ వస్తే పథకాలన్నీ కట్
- టీడీపీ 'ఇదేం ఖర్మ' ఫొటోలకే పరిమితం
- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

మక్కువ: పేదలను నవరత్నాలతో ఆదుకుంటున్న ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దామని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పథకాలన్నీ కట్ చేస్తుందని ఆయన పేర్కొన్నారు. స్థానిక సాయిభగవాన్ కల్యాణ మండపంలో పెంచిన పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజన్నదొర మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డికే దక్కుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేందుకు 24 రకాల పింఛన్లు అందిస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నారన్నారు. పింఛన్ లబ్ధిదారుల్లో జగనన్న చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. సంక్షేమాన్ని చూసి ఓర్వలేక టీడీపీ నేతలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తెలుగుదేశం చేపట్టిన 'ఇదేం ఖర్మ' కార్యక్రమం ఫొటోలకే పరిమితమైందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను పూర్తిగా నిలిపివేస్తుందన్నారు. ఈ క్రమంలో జగన్మోహన్రెడ్డిని మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలపై ఉందన్నారు. టీడీపీ నేతల అబద్ధాలు నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, సర్పంచ్ ఒంటి రామలక్ష్మి, ఎంపీడీఓ పి.దేవకుమార్, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పెద్ద సంఖ్యలో పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా జగనన్న

- 488 మందికి కొత్త పింఛన్ల పంపిణీ
- ఎమ్మెల్యే జోగారావు



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి అండగా ఉన్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 488 మందికి కొత్త పింఛన్లు మంజూరు కాగా వాటిని లబ్ధిదారులకు ఎంపీపీ బి.రవణమ్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా జగన్మోహన్రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక పక్కాగా అమలు చేస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీలే కాకుండా ప్రజల కష్టాలను తెలుసుకున్న ముఖ్యమంత్రి మరిన్ని సంక్షేమ పథకాలతో ప్రజలకు అండగా ఉన్నారని కొనియాడారు. ప్రతి నెలా ఒకటో తేదీ వేకువజామునే లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డికే దక్కుతుందన్నారు. అవినీతి రహిత పాలనతో ప్రజలకు చేరువయ్యారన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థతో ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువయ్యాయని గుర్తు చేశారు. 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పెత్తందార్లకు, పేదలకు మధ్యే పోటీ ఉంటుందని దీన్ని ప్రజలు గుర్తించి మళ్లీ జగన్మోహన్రెడ్డినే ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో పార్వతీపురం నియోజకవర్గంలో సువర్ణముఖి నదిపై నారాయణపురం, గెడ్డలుప్పి, సీతానగరం ప్రాంతాల్లో బ్రిడ్జిల నిర్మాణం జరిగిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండూ సమపాళ్లలో జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీడీఓ బి.క్రిష్ణమహేష్రెడ్డి, ఏఓ ప్రసాద్, వైఎస్సార్సీపీ మండల నాయకులు బి.చిట్టిరాజు, పి.ఈశ్వరనారాయణ, ఎస్.రామకృష్ణ, ఆర్వీ పార్థసారధి, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

- ఏఎస్పీ, ఎస్ఈబీ జేడీ దిలీప్కిరణ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ దిలీప్కిరణ్

పార్వతీపురం టౌన్: మాదక ద్రవ్యాలకు యువత ఆకర్షితులు కావొద్దని, వీటిపై విద్యార్థులకు అవగాహన తప్పనిసరని జిల్లా అదనపు ఎస్పీ, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ ఓ.దిలీప్ కిరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం ప్రాణాంతకమని, దేశ శక్తిని, యువతను నిర్వీర్యం చేస్తుందన్నారు. డ్రగ్స్ సమాజ మనుగడకు, యువత జీవితానికి వినాశనకారి అన్నారు. దీన్ని పారదోలేందుకు విద్యార్థులంతా సామాజిక బాధ్యతగా ముందుకు రావాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంపై పటిష్ట నిఘా పెట్టామన్నారు. ముఖ్యంగా యువత ధూమపానం, మద్యపానం, గంజాయికి దూరంగా ఉండాలని సూచించారు. చదువుకునే వయస్సులో మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. తమ భవిష్యత్తులో ఎన్నో ఉన్నత శిఖరాలకు ఎదిగే తరుణంలో మత్తు పదార్థాలకు దూరంగా ఉండి భావితరాలకు ఆదర్శంగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు ఆసరాగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ సీహెచ్ శ్రీధర్, ఉపేంద్ర, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజు, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం : పీఓ

సాలూరు: మున్సిపాలిటీ పరిధిలో జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఐటీడీఏ పీఓ, సాలూరు గృహ నిర్మాణ శాఖ ప్రత్యేకాధికారి విష్ణుచరణ్ అన్నారు. నెలిపర్తిలో జగనన్న లే అవుట్ను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లే అవుట్ల వద్ద పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. నిర్మాణాలకు ప్రస్తుతం అనుకూల వాతావరణాలున్నాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, నిర్మాణాలు వేగం పెంచాలని ఆదేశించారు. అనంతరం ఐటీఐ కళాశాల ఆవరణలో ఐటీడీఏ ఆధ్వర్యంలో పెట్రోల్బంక్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. పీఓ వెంట మున్సిపల్ కమిషనర్ శంకరరావు, తహసీల్దార్ రామస్వామి, ఆర్ఐ సంతోష్కుమార్ ఉన్నారు.



నెలిపర్తి జగనన్న కాలనీ వద్ద ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీఓ విష్ణుచరణ్

అన్యాక్రాంత భూములు పేదలకివ్వాలి



ర్యాలీ చేస్తున్న గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు

మక్కువ: మండలంలోని పలు పంచాయతీలకు చెందిన పేదలకు ప్రభుత్వం అందించిన డీ పట్టా భూములను ఇతర జిల్లాలకు చెందిన పెత్తందార్లు, భూస్వాములు ఆక్రమించుకున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతల తవిటి నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు, గిరిజన సంఘం మండల నాయకుడు ఓటిక సుందరరావు పేర్కొన్నారు. అన్యాక్రాంతమైన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని తిరిగి పేదలకు ఇవ్వాలని కోరుతూ మక్కువలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెత్తందార్లు ఆక్రమించుకున్న భూములను అధికారులు స్వాధీనం చేసుకొని, తిరిగి పేదలకు అందివ్వాలని కోరారు. బోయివాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చరాదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అల్లు ఆదినారాయణ, యువజన నాయకులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన పనులు

సాలూరు: మండలంలోని కొదమ పంచాయతీ గిరిశిఖర సిరివర రోడ్డు నిర్మాణ పనులను మక్కువ అటవీ శాఖ అధికారులు నిలుపుదల చేశారు. మక్కువ మండలం చిలకమెండంగి వద్ద జరుగుతున్న ఎర్త్వర్క్ పనులను అటవీశాఖ అనుమతులు లేవని అక్కడ అధికారులు శుక్రవారం నిలిపేశారు. కాగా రూ.48 లక్షలతో జరుగుతున్న పనులకు సుమారు మూడు కిలో మీటర్లకు అటవీశాఖ అనుమతులు ఉన్నాయని ఐటీడీఏ ఈఈ మణిరాజ్ తెలిపారు. అనుమతుల వివరాలు అటవీశాఖ అధికారులకు అందిస్తామని శనివారం నుంచి మళ్లీ ఈ పనులు కొనసాగొచ్చని అభిప్రాయపడ్డారు. దీనిపై ఫారెస్ట్ రేంజర్ కె.రామారావును వివరణ కోరగా చిలకమెండంగి నుంచి లుచ్చ, లుచ్చ నుంచి బందమెండంగి వరకు అటవీ శాఖ అనుమతులు ఉన్నాయని స్పష్టం చేసారు. ఈ అనుమతులున్నాయనే విషయాన్ని మక్కువ అధికారులుకు తెలియజేశానని, పనులు కొనసాగింపునకు ఆదేశించానని తెలిపారు. అనుమతులు ఉన్నంత వరకు ఈ పనులకు అటవీశాఖ అధికారులు ఆటంకం కలిగించరని తెలిపారు. బందలుప్పి నుంచి సిరివర రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు తీసుకోవాలని అన్నారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి



ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పనులను పరిశీలిస్తున్న డీఈఓ రమణ

సీతానగరం: జిల్లాలో మన బడి నాడు – నేడు పనులు నాణ్యతా ప్రణాలకు లోబడి చేపట్టాలని డీఈఓ ఎస్డీవీ రమణ అన్నారు. మండలంలోని సెకెండ్ ఫేజ్ నిధులతో మంజూరైన మన బడి నాడు – నేడు పథకం ద్వారా పెదబోగిలి-2 ప్రాథమిక పాఠశాలలోని, స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జరుగుతున్న పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో విద్యాలయాలు దేవాలయాలుగా భావించడం వలన విద్యాబోధనలకు, విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతోందన్నారు. జరుగుతున్న పనులన్నీ నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. వారంలో మూడు రోజులు నాడు నేడు పనులను పరిశీలించడం జరుగుతుందన్నారు. శతశాతం ఉత్తీర్ణత సాదించడానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలన్నారు. ఎంఈఓ జి.సూరిదేముడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.రేణుక, ఇంజినీరింగ్ అధికారులు, ఎస్ఎస్ఎస్ పీఓలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న డీఐఓ జగన్మోహన్రావు

పార్వతీపురం టౌన్: శిశువుల ఆరోగ్యం పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డా. జగన్మోహన్రావు అన్నారు. స్థానిక గిరిజన సామాజిక భవనంలో జరుగుతున్న సీహెచ్ఓల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశువు ఆరోగ్య కార్యక్రమాలు, టీకాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. డిసెంబర్ 26 నుంచి జిల్లాలోని హెల్త్ వెల్నెస్ కేంద్రాలకు చెందిన సీహెచ్ఓలకు అన్ని ఆరోగ్య కార్యక్రమాలపై దశల వారీగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు శిక్షణ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ శంకర్, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ అరుణ్కుమార్లు శిక్షణను సీహెచ్ఓలకు ఇచ్చారు.

అందరూ డ్రై డేను పాటించాలి



వసుంధరనగర్ సమీపంలో పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం: ప్రతీ ఒక్కరు డ్రైడేను పాటించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా స్థానిక పార్వతీపురంలో గల వసుంధరనగర్, వెంకంపేట వద్ద జిల్లా మలేరియా అధికారితో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో పారిశుద్ధ్యం ప్రాముఖ్యత, డ్రైడే ఆవశ్యకత తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారంలో ఒక రోజు పాత్రలను ఖాళీ చేసి ఎండలో పూర్తిగా ఆరవేసిన తరువాత వినియోగిస్తే అందులో ఉండే బ్యాక్టీరియా, లార్వా పూర్తిగా నశించిపోతాయన్నారు. డ్రైడేను పాటించడం వల్ల ఆహార పదార్థాలు కలుషితం కాకుండా ఉంటాయన్నారు. దోమల నివారణకు ప్రతీ ఒక్కరు దోమ తెరలను, దోమ నిరోధకాలను వినియోగించాలన్నారు. ముఖ్యంగా ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకొనేందుకు ప్రతీ ఒక్కరు సంపూర్ణ అవగాహన కలిగివుండడంతో పాటు ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడ్ని ప్రతీ ఒక్కరు పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి కె. పైడిరాజు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి



మహిళలకు నమూనా చెక్కును అందజేస్తున్న పీడీ కిరణ్కుమార్ తదితరులు

- డీఆర్డీఏ పీడీ కిరణ్కుమార్

పార్వతీపురం: బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలతో మహిళా సంఘాల సభ్యులు చిన్న చిన్న వ్యాపారాలు చేసి ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్డీఏ పీడీ పి.కిరణ్కుమార్ అన్నారు. మండలంలోని పెదబొండపల్లిలో ఏపీజీవీబీ ఆధ్వర్యంలో మహిళా సంఘాలతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 62 మహిళా సంఘాలకు రూ.3కోట్ల 51 లక్షల 50వేలు రుణాలకు సంబంధించిన చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తుందన్నారు. ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్ బి.సోమేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే ప్రభుత్వం నుంచి రాయితీలు పొందే అవకాశం ఉంటుందన్నారు. బ్యాంకుల్లో బీమా సౌకర్యాన్ని కూడా కల్పించనున్నట్టు తెలిపారు. ఖాతాదారులు బీమాను పొందాలన్నారు. ఏపీడీ వై.సత్యంనాయుడు మాట్లాడుతూ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలతో జీవనోపాధుల కోసం చిన్న చిన్న కుటీర పరిశ్రమలను నెలకొల్పి ఆదాయాన్ని పొందాలని సూచించారు. సమావేశంలో బ్రాంచ్ మేనేజర్ శైలజ, ఫీల్డ్ ఆఫీసర్ శంకరరావు, ఏపీఎం టి.సురేష్, సర్పంచ్ సవరపు తాడమ్మ, మహిళా సంఘాల సభ్యులు, సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు చర్యలు

పార్వతీపురం: వినియోగదారుల రక్షణ చట్టం 2019 ప్రకారం వినియోగదారుల హక్కులకు రక్షణ కల్పిస్తూ వారిలో బాధ్యతను, చైతన్యాన్ని తీసుకురావడానికి అనేక చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా పౌర సరఫరాల అధికారి కేవీఎల్ఎన్ మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమర్థవంతమైన వినియోగదారుల వివాదాల పరిష్కార వేదికలను కూడా అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యాలయం నందు ప్రజలు, వినియోగదారులు, ధాన్యం కొనుగోలుకు సంబంధించి సమస్యల పరిష్కారం తెలుపుటకు పౌర సరఫరాల శాఖ కమీషనర్, ఇంటిగ్రేటెడ్ కాల్సెంటర్ను నెలకొలిపేందుకు ఆదేశాలను జారీ చేశారన్నారు. ఈ మేరకు టోల్ఫ్రీ నంబర్లు 1800 425 0082/1967(పౌర సరఫరాల శాఖ), 1800 425 3157/14445(ఒకే దేశం ఒకే రేషన్ కార్డు), 1800 425 2388/155235(రాష్ట్ర ఆహార కమిషన్), 1800 425 4202 (తూనికలు, కొలతల శాఖ) పైన తెలిపిన అన్ని టోల్ఫ్రీ నంబర్లను 1967ఇంటిగ్రేటెడ్ కాల్సెంటర్ నంబరుగా అనుసంధానం చేయడం జరిగిందన్నారు. ఈ నెల 10 నుంచి ఈ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రతీ రోజు కార్యాలయ పనివేళల్లో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ మేరకు ప్రజలంతా ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తమ సమస్యల పరిష్కారం నిమిత్తం ఫిర్యాదులను చేయవచ్చునని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

విద్యార్థులకు పెట్టెల పంపిణీ



విద్యార్థులకు అందిస్తున్న కొత్త పెట్టెలు

సాలూరు: మండలంలోని పీఎస్బొడ్డవలసలో డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్మీడియెట్ ఫస్టియర్ విద్యార్థులకు కొత్త పెట్టెలు శుక్రవారం అందజేశారు. 130 మంది విద్యార్థులకు వీటిని అందించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సాలూరు: విద్యార్థినులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని బాగువలస పీహెచ్సీ వైద్యుడు డా.రవికుమార్ అన్నారు. డీఆర్డీఏ పీడీ ఆదేశాల మేరకు వెలుగు ఏపీఎం సింహాచలం ఆధ్వర్యంలో మండలంలోని బాగువలసలో గ్రామ సంఘాలు,విద్యార్థినులతో వేర్వేరుగా శుక్రవారం సమావేశాలను నిర్వహించారు. స్థానిక హైస్కూల్లో కిశోర బాలికలకు ఆహార పోషణ, రక్తహీనత అంశాలపై అవగాహన పెంపొందించారు. పౌష్టికాహారాలను తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

కుక్కల దాడిలో ఆవు పెయ్యి మృతి

బలిజిపేట: గలావల్లిలో శుక్రవారం కుక్కలు జరిపిన దాడిలో ఎస్.కామేశ్వరరావుకు చెందిన ఆవు పెయ్యి మృతి చెందింది. 20రోజుల క్రితం ఆవు దూడకు జన్మనిచ్చిందని కామేశ్వరరావు తెలిపారు. పశువుల శాలలో ఉంచిన ఆవు దూడపైకి కుక్కలు ఒక్కసారి దాడిచేసి చంపేశాయి. వాటిని నియంత్రించినా ఫలితం లేకపోయిందని తెలిపారు.

పైపులైన్కు మరమ్మతులు



పైపులైన్కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పార్వతీపురం: మండలంలోని చినబొండపల్లిలో రక్షిత మంచినీటి పథకానికి సంబంధించి ప్రధాన వీధిలో వున్న పైపులైనుకు మరమ్మతులను సర్పంచ్ గండి శంకరరావు పర్యవేక్షణలో శుక్రవారం నిర్వహించారు. పైపులైను మరమ్మతులకు గురవ్వడంతో తాగు నీరు సరఫరా అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ మేరకు ప్రజలకు తాగునీటి అవస్థలు లేకుండా సర్పంచ్ పర్యవేక్షణలో తాగునీటి సరఫరా పైప్కు మరమ్మతులు చేపట్టడంతో ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా అవుతుంది.

సీతానగరం: పెదబోగిలి పంచాయతీలో మరమ్మతులకు గురైన వీధి కుళాయిలకు సంబంధించిన ట్యాప్ల స్థానంలో కొత్తగా ట్యాప్లు వేస్తున్నట్టు పంచాయతీ ఈఓ జి.వెంకటరావు అన్నారు. పెదబోగిలి పంచాయతీలో వీధికుళాయిల మరమ్మతు పనులు శుక్రవారం చేపట్టారు.

6 ఏ కేసు నమోదు

పార్వతీపురం: మండలంలోని జమదాల రేషన్ డిపో నిర్వాహకురాలు జి.సునీతపై 6 – ఏ కేసును నమోదు చేసినట్లు పార్వతీపురం సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ రమణారావు తెలిపారు. శుక్రవారం రేషన్ డిపోలో నిల్వలను పరిశీలించగా ఉండాల్సిన బియ్యం కంటే 66 క్వింటాళ్లు తక్కువగా ఉన్నాయన్నారు. రేషన్ పంపిణీలో అక్రమాలు చోటు చేసుకోవడంతో డిపోలో వున్న 55 బస్తాల(27.5 క్వింటాళ్లు) బియ్యాన్ని సీజ్ చేసి వీఆర్ఓ లక్ష్మణరావుకు అప్పగించినట్లు తెలిపారు. తదుపరి చర్యలు నిమిత్తం ఉన్నతాధికారులుకు నివేదించనున్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆదరించాలి



కార్యాలయ సముదాయంలో ఏర్పాటు చేసిన కూరగాయల స్టాల్

పార్వతీపురం: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అన్ని వర్గాల వారు ఆదరించి రైతులను ప్రోత్సహించాలని ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం షణ్ముఖరాజు అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కార్యాలయ సముదాయంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ కూరగాయలను ఉద్యోగులు కొనుగోలు చేయాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.